

నేటినుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి మార్చి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు సెంటర్లను పరిశీలించారు. ప్రతి కాలేజీలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 86 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి కేంద్రం వద్ద తాగడానికి నీళ్లు ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు అనుమతించరాదని సూచించారు. పరీక్షా కేంద్రాల దగ్గర జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పరీక్ష అనంతరం ఆన్సర్‌షీట్లకు ఎస్కార్ట్‌గా వెళ్లి పోస్టాఫీసు వద్ద అప్పగించాలని సూచించారు.

సంక్షేమానికి కోత 'విజన్'కు వాత



'కూటమి' ప్రభుత్వంపై జిల్లా ప్రజానీకం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వీరి ఆశలు అడియాశలయ్యాయి. 'సూపర్‌సిక్స్' పథకంలో తల్లికి ఇందనం, అన్నదాత సుఖీభవ మినహా మరో రెండింటి ఊసేలేదు. ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర నిరాశే మిగిల్చింది. జిల్లాలో తెలుగుగంగ, సోమశిల-స్వర్ణముఖి, గాలేరి నగరిలకు పైసా విదల్చలేదు. హంద్రీనీవా కాల్వ విస్తరణకు, వారి జీతాలకు 14లక్షల 90వేల 71 రూపాయి కేటాయించారు. మధ్యతరగతి ప్రాజెక్టులు గమనంలో లేవనే చెప్పాలి. 'విజన్-2047' అని చెబుతున్నా అవేమీ ఈ బడ్జెట్‌లో కేటాయించకపోవడం గమనార్హం. ఉగాది నుంచి 'పి4' అమలు చేస్తామని, తద్వారా రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అయితే 'విజన్-2047' వ్యూహం ఏంటో, నిధులు ఎక్కడినుంచో తెస్తారో స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



నీటి ప్రాజెక్టులకు నిధులు నిల్ 'మినిమం టైంస్కేల్' ఊసేలేదు 'సూపర్‌సిక్స్'లో రెండే అమలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్-2025-26ను ప్రవేశపెట్టారు. 3లక్షల 22వేల 359 కోట్లుగా వెల్లడించారు. నీటి ప్రాజెక్టులకు 32వేల కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా 21వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అందులోనూ 3వేల కోట్లు తగ్గించి 18వేలు కోట్లుగా ప్రకటించారు. మొత్తం బడ్జెట్‌లో ఆరువేల కోట్లు పోలవరం ప్రాజెక్టుకు వెళితే, మిగిలిన 12వేల కోట్లు రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు కేటాయింపులు విదిల్చినట్లయ్యింది. ఈ నిధులు సిబ్బంది వేతనాలకు, ప్రాజెక్టుల నిర్వహణకే సరిపోదన్నది ఇంజినీర్లు పెదవి విరుస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో నీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేసి 2లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలంటే 10వేల కోట్లు కేటాయించాలని రాయలసీమ మంత్రులు, ఎంఎల్‌ఎలు సిఎంను కలిసినా ప్రయోజనం లేకపోయింది. కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నిధులు తెస్తామని సిఎం ఇచ్చిన హామీలో భాగంగానే ఆ ప్రాజెక్టుకు అంతోఇంతో నిధులు కేటాయించడం గమనార్హం. పద్మావతి, వెటర్నరీ, ఎస్వీయూ, అగ్రికల్చర్ యూనివర్సిటీ కొత్త భవనాలకు, పాత భవనాల మరమ్మతుకు కోటి రూపాయలు కేటాయించారు.

ప్రస్తుతం తిరుపతి జిల్లాలో సామాజిక పింఛన్లు 2,62,461 మందికి112.06 కోట్లు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన సామాజిక పింఛన్ల తనిఖీల్లో కొన్నింటిని రద్దుచేస్తారన్న ముందస్తు ఆలోచనతోనే బడ్జెట్‌లో నిధులు తగ్గించడం గమనార్హం. తాజాగా జరిగిన క్యాబినెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను మే నెలలో ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రంలో 81లక్షల మంది విద్యార్థులు ఉండగా తిరుపతి జిల్లాలో 12లక్షల మంది ఉన్నట్లు లెక్కలు తేల్చారు. అన్నదాత సుఖీభవకు అరకొర నిధులను కేటాయించారు. తిరుపతి జిల్లాలో 5లక్షల 75వేల78 మంది రైతులు ఉంటే బడ్జెట్ కేటాయింపుల పరిస్థితి చూస్తే రైతులందరికీ ఇస్తారా అన్న అనుమానం వస్తోంది. అయితే ఎన్నికల హామీల్లో భాగంగా ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి, ఎంత మంది రైతులు ఉంటే అంతమందికి పథకాలు అమలు చేస్తామని చెప్పి ఉండటం గమనార్హం. ఉద్యోగ, ఉపాధ్యా పెన్షనర్లకు పిఎఫ్, ఫైనల్ పేమెంట్లు, డిఎ బకాయిలు, పిఆర్‌సి అరియర్స్, పెన్షనర్లకు గ్రాడ్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఉద్యోగుల సరెండర్ లీవులకు 30వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉంది. 2023, జులై నుంచి పిఆర్‌సి ప్రకటించాల్సి ఉంది. అయితే విద్యారంగానికి 9.86 శాతమే నిధులను కేటాయించారు. ఏదిఏమైనప్పటికీ ప్రజల ఆశలకు, కూటమి కేటాయింపులకు పొంతన లేదు.

కూటమి వాగాడంబరం



వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

రూ.3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేలా లేదు. పైగా లక్షల కోట్లు అదనంగా అప్పు తేనున్నారు. అప్పులను చూసి పథకాలకు కోత పెట్టే ప్రమాదం ఉంది. విద్యుత్ ట్రూ అప్‌ఛార్జీల విధింపు గురించి ప్రస్తావించిన మంత్రివర్యులు, పాతికేళ్లపాటు దోచుకుతినే సెకీ ఒప్పందంపై పల్లెత్తు మాట అనలేదు. ఇరిగేషన్, సంక్షేమ కార్యక్రమాలకు గత బడ్జెట్ కన్నా పెరుగుదల పెద్దగా లేదు. తల్లికి వందనం కేటాయింపులు తగ్గాయి. యువతకు నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు.

విద్యారంగానికి కేటాయింపులేవి?



ఎస్‌ఎస్ నాయుడు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఉద్యోగ ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సత్వరం అమలు చేయాల్సిన పిఆర్‌సికి సంబంధించి గానీ, మధ్యంతర భృతి గానీ లేదు. వేల కోట్ల రూపాయల బకాయిలకు సంబంధించి కేటాయింపుల్లేవు. బడ్జెట్లో 20శాతం నిధులను కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పినప్పటికీ 9.86 శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన మోడల్ స్కూల్స్‌కు, నాడు-నేడు అర్ధాంతరంగా ఆగిపోయిన పనులకు నిధుల్లేవు.

అంతా అంకెల గారడీ



మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపి

ఈ బడ్జెట్ వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు. పిట్టకొంచం కూత ఘనం అనేలా అంకెల గారడీగా ఉంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల కేటాయింపు చూస్తుంటే లబ్దిదారుల సంఖ్యలో కోత పడుతుందని చెప్పకనే చెబుతుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ బృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు 1500 పథకాలకు మోక్షం ఎపుడో చెప్పలేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి, కేవలం అంకెల గారడీ చేయడం దారుణం.

ఉద్యోగ కార్మికులకు నిరాశ



కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు

నిత్యావసర వస్తువుల పెరుగుదల నియంత్రణ గురించి ప్రస్తావన లేదు. ఉద్యోగులు ఎదురుచూస్తున్న పిఆర్‌సి ఊసే లేదు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని మూడు లక్షల మంది కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్, వేతనాల పెంపు గురించి చెప్పలేదు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ పరిధిలోని 50 లక్షల మంది కార్మికులను గత 20ఏళ్లుగా పట్టించుకోలేదు. కనీస వేతన జీవో సవరించలేదు. వలంటీర్లకు రూ.10వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. నిరుద్యోగ భరోసా లేదు. స్కీం వర్కర్లకు మొండిచేయి చూపారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలేవీ అమలయ్యేలా బడ్జెట్ లేదు

సామాన్యులకు ఒరిగిందేమీ లేదు



పి.మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి

కూటమి బడ్జెట్ వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదు. అంకెల గారడీతో అభూతకల్పన చేసేలా ఉంది. వ్యవసాయ రంగానికి పూర్తిస్థాయిలో నిధులను కేటాయించలేదు. సాగునీటిప్రాజెక్టులు ఎప్పటిలోపు పూర్తవుతాయో స్పష్టత లేదు. ఉద్యోగ కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు శూన్యం. సూపర్‌సిక్స్ పథకాలకు అంతంతమాత్రంగానే కేటాయించారు. అప్పులు తెచ్చి పాలన నడిపిస్తూ, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఈ బడ్జెట్ కేటాయింపులు చేశారు.

నిరుద్యోగులను విస్మరించారు



యార్లపల్లి గోపి, కాంగ్రెస్

బడ్జెట్‌లో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోయింది. వెనుకబడిన రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో చిత్తశుద్ధి లేదు. చంద్రబాబునాయుడు చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. మహిళలకు ఉచిత బస్సు సంబంధించి నిధుల కేటాయింపు ప్రకటన లేదు. కేవలం కార్పొరేట్ కంపెనీలకు మేలు జరిగేలా ఈ బడ్జెట్ ఉంది.

అందరికీ అనుకూల బడ్జెట్



మహబూబ్‌బాషు, టిడిపి మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంది. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీఠం వేశారు. గత వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు లక్షల 22 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ పెట్టి రైతులకు, ఉద్యోగులకు, కార్మికులకు, మహిళలకు, కులసంఘాలకు మేలు కలిగేలా నిధులు కేటాయించారు. నిరుద్యోగ యువతకు ఐటీ కంపెనీల్లో కొలువులు కల్పించేందుకు పరిశ్రమలను తీసుకురానున్నారు.



టిటిడి ఉద్యోగుల క్రీడలను ప్రా:బిస్తున్న ఛైర్మన్ బిఆర్ నాయుడు

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీకి చర్యలు

టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టిటిడిలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీ ద్వారా యువతకు అవకాశం కల్పిస్తామని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు తెలిపారు. టిటిడి ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిటిడి ఉద్యోగులు జాతీయ, అంతర్జాతీయ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లలో విజేతలుగా నిలిచే స్థాయికి తయారుకావాలని కోరారు. వచ్చే ఏడాదికి యువతతో పటిష్ట టీంలను తయారు చేయాలని సూచించారు. ప్రతి ఏడాదీ ఆటల పోటీలు నిర్వహించడం వల్ల ఉద్యోగులు శారీరకంగా దఢంగా ఉంటారన్నారు. టిటిడి ఉద్యోగుల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, వారి మానసిక వికాసం కోసం 1977వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు ఉద్యోగులతో క్రీడాప్రతిజ్ఞ చేయించారు. ముందుగా ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో, జేఈవో కలిసి క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు. బెలూన్లు, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. పోటీల్లో మొదటి స్థానం గెలుచుకున్న వారికి రూ.2వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.1800, మూడో స్థానంలో నిలిచినవారికి రూ.1600 విలువగల బ్యాంకు గిఫ్ట్‌కార్డులు బహుమతులు అందజేస్తామన్నారు. పురుషులకు, మహిళలకు వేరువేరుగా పోటీలు, ప్రత్యేక ప్రతిభావంతులకు, సీనియర్ అధికారులకు, రిటైర్డ్ ఉద్యోగులకు పోటీలను నిర్వహిస్తారు. ఇందులో టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడలు ఉన్నాయి. పరేడ్ మైదానంతో పాటు రిక్రియేషన్ హాల్, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ మైదానం, ఎస్వీ జూనియర్ కాలేజీ, ఎస్వీ హైస్కూల్ ఎస్వీ యూనివర్శిటీ, ఎస్వీ అగ్రికల్చర్, వెటనరీ యూనివర్శిటీ మైదానాలలో ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జేఈవో వి.వీరబ్రహ్మం, డీఎల్వో ఎ. వరప్రసాద్ రావు, సీపీఆర్వో డాక్టర్ టీ.రవి, విజిఓ సదాలక్ష్మీ, వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. ఆనంద రాజు పాల్గొన్నారు.

'ఆప్కాస్'ను కొనసాగించండి




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే ఆప్కాస్ విధానాన్ని యధాతధంగా కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెనగడం గురవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం సిఐటియు అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా హామీ ఊసే లేదని వాపోయారు. పైగా మున్సిపల్ కార్మికులను కాంట్రాక్టు పరిధిలోకి తీసుకొచ్చేందుకు కూటమి సర్కారు సన్నాహాలు చేస్తోందంటూ మండిపడ్డారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకిచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సిఐటియు నేతలు వడ్డేపల్లి చెంగయ్య, గంధం మణి, గెడి వేణు, వై.కుమార్, వెలివేంద్రం పాల్గొన్నారు.

- గూడూరులో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

- సూళ్లూరుపేటలో.. ఆర్‌డిఓ కార్యాలయంలో మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు ఎస్ అల్లెయ్య, సిఐటియు నాయకులు బి.పద్మనాభయ్య, సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ఉపాధ్యక్షులు చినబాబు, కోశాధికారి కళ్యాణ్, చంగయ్య, ఆదిలక్ష్మి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



తమకు న్యాయం చేయాలంటూ వైష్ణవి డెయిరీ ఉద్యోగుల నిరవధిక దీక్ష

'వైష్ణవి' ఉద్యోగుల నిరవధిక దీక్ష

'కల్తీలడ్డు' ఘటనతో రోడ్డున పడ్డ ఉద్యోగులు

ప్రజాశక్తి - పెళ్లకూరు


తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పునబాక గ్రామం వద్ద ఉన్న వైష్ణవి పాల డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగులు గత 10 రోజులుగా ఫ్యాక్టరీ బయట గేటు వద్ద బైఠాయించి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్ళగా... సుమారు 15 సంవత్సరాలుగా వైష్ణవి పాల డెయిరీలో వీరంతా పనిచేస్తున్నారు. గత ఏడాది తిరుమల లడ్డు కల్తీ విషయంలో వైష్ణవి డెయిరీ లైసెన్సులను ఎస్‌ఎస్‌ఎఫ్ఐ వారు రద్దు చేశారు. 'సిట్' కేసులలో వైష్ణవి యాజమాన్యం పరారు కావడంతో వైష్ణవి పాల కంపెనీ మూత పడింది. అదే సమయంలో బోలె బాబా పాల డెయిరీ వారు వైష్ణవి పాల డెయిరీని కొనుగోలు చేసి, అందులో పని చేస్తున్న కార్మికులను డిసెంబర్ 12వ తేదీ పిలిపించుకుని వారికి రావలసిన జీతాలు, పిఎఫ్, డిఏలు మొదలైన అన్నీ కలిపి జనవరి 31వ తేదీ లోపల చెల్లించే విధంగా అక్కడున్న కార్మికులను ఒప్పించి, లిటికేషన్ పెట్టారు. మీకు రావలసిన మొత్తము రావాలంటే దీనికి సంబంధించిన టెర్మినేషన్ ఫారాలు మీద సంతకాలు చేయవలసి వస్తుందని నమ్మించి సంతకాలు చేయించుకున్నారు. కానీ జనవరి 31వ తేదీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగస్తులు అందరూ కలిసి, కొత్త డైరెక్టర్ అని చెప్పుకుంటున్న ఒకరైన శుక్ల అను అతనిని నిలదీయగా మరో 15 రోజులు గడువు కోసం అందర్నీ ఒప్పించారు. అప్పటికి న్యాయం చేయకపోగా యాజమాన్యాన్ని అడుక్కోండి, మాకు సంబంధం లేదని నిక్కచ్చిగా చెప్పేశారు. ప్రస్తుతం యాజమాన్యం వ్యవహరిస్తున్న వారి తీరు, బోలేబాబా సంస్థ కు చెందిన వారు పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన జీతం వగైరాలు ఇచ్చుటకు నిరాకరించుటతో వేరే ప్రత్యామ్నయం లేక నిరసనగా కార్మికులు కంపెనీ ముందు కూర్చుని నిరసనకు దిగారు. తమ యుక్తవయస్సు మొత్తం ఈ ఫ్యాక్టరీకి ధారపోశామని ప్రస్తుతం ఎక్కడి వెళ్లి పనిచేయాలన్నా వయసు మీద పడిందని, అవకాశాలు తక్కువ ఉన్నాయని వారు వాపోయారు. తమకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఇలానే కొనసాగుతుందని వారు తెలియజేశారు. వీరి ఆందోళనకు సిఐటియు నాయకులు ముకుంద మద్దతు ప్రకటించారు. న్యాయం జరగని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు గురవయ్య, పెళ్లకూరు బాధ్యులు పుట్టయ్య పాల్గొన్నారు.

నేడు సామాజిక పింఛన్లు పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు 1న ఉదయం 7 గంటల నుంచి లబ్దిదారుల ఇళ్ల వద్దనే పంపిణీ చేనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఏ కారణం చేతనైనా ఇంటి వద్ద ఇవ్వడం కుదరకపోతే తగిన కారణాలను యాప్‌లో పొందుపరచాలన్నారు. మార్చి నెలకు సంబంధించి 2,62,461 మంది పింఛన్‌దారులకు దాదాపు 112.06 కోట్ల రూపాయలను పంపిణీ చేయనున్నామని, శనివారం వందశాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు.

జాతీయస్థాయిలో 'సైన్స్' స్ఫూర్తి నింపాలి



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి - క్యాంపస్, యంత్రాంగం

జాతీయస్థాయిలో 'సైన్స్' స్ఫూర్తి నింపాలని వక్తలు ఉద్ఘాటించారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలను నిర్వహించి, శాస్త్రవేత్తల సేవలను జ్ఞప్తిచేసుకున్నారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు.

క్యాంపస్‌లో.. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ శాస్త్రీయ దినోత్సవం శుక్రవారం శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. నోబుల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ అద్భుతమైన రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజునూ ఆయనకు గౌరవ సూచికంగా భారత ప్రభుత్వం 1987 ఫిబ్రవరి 28 నుంచి 'జాతీయ శాస్త్రీయ దినోత్సవం (జాతీయ సైన్స్ దినోత్సవం)' జరుపుకోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా వర్సిటీలో సాంస్కృతిక విభాగపు కోర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్ అధ్యక్షతన వినూత్నంగా 'సైన్స్ డ్రామా' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ విసి ఆచార్య అప్పారావు, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆచార్య ఎన్ సి రాయుడు పాల్గొని మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహిస్తూ, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సురేంద్రబాబు, ఆచార్య నరసింహ, నాదముని, కళ్యాణ్, శరత్ బాబు పాల్గొన్నారు. క్యాంపస్ స్కూల్లో శాస్త్రీయ ప్రదర్శన పోటీలను స్కూలు ప్రధానోపాధ్యాయురాలు శకీనమ్మ, ఆచార్య పి.సరోజ, నిర్వాహకురాలు కె.రాధమ్మ పాల్గొన్నారు. భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆచార్య దేవప్రసాద్ రాజు ఆధ్వర్యంలో సదస్సుశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు విజయభాస్కర్‌రావు పాల్గొన్నారు. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల్లోని సైన్స్ అసోసియేషన్, ఐక్యఎసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ హెడ్ డాక్టర్ .సి.మధుమతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. టి.నారాయణమ్మ, కన్వీనర్ డా. వై శిరీష, కో కన్వీనర్ డా. వై సునీతపాల్గొన్నారు.

జీవకోనలోని విశ్వం హైస్కూల్లో సైన్స్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు వంద ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. చార్టెడ్ అకౌంటెంట్ పి.సుదర్శనం నాయుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొన్నారు.

- తిరుపతి (మంగళం)లో..ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించినట్లు ఎంఇఒ భాస్కర్‌నాయక్ తెలిపారు. శ్రీనివాస ప్రైవేట్ స్కూల్లో ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ నమూనాలను పరిశీలించారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

- తిరుపతి టౌన్‌లో... బేరివీధి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, సైన్స్ ఉపాధ్యాయులు షేక్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ విజ్డమ్ తిరుపతి ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం పాల్గొన్నారు. ఎస్‌పిజెఎన్‌ఎం ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్ విశాల ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు మునిశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌టియు నాయకులు కత్తి నరసింహారెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు బాలాజీ, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

- రేణిగుంటలో...కరకంబాడిలోని అమరరాజా విద్యాలయంలో ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు నిర్వహించిన క్విజ్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. రెయిన్‌బో ఈ స్మార్ట్ స్కూల్లో ఛైర్‌పర్సన్ అతావుల్లాఖాన్ పాల్గొన్నారు. విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయడమే లక్ష్యం అన్నారు.

- చిట్టమూరులో... కొత్తగుంటలోని తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి విద్యాసంస్థల్లో నర్సరీ నుంచి పదో తరగతి వరకూ సైన్స్‌డేలో అన్ని సబ్జెక్టుల నుంచి నమూనాలను ప్రదర్శించారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మితో కలిసి సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

- పుత్తూరు టౌన్‌లో... రామన్ తన యావత్ జీవితాన్ని దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి త్యాగం చేశారని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వి.వీరయ్య అన్నారు. అధ్యాపకులు పద్మావతి, డాక్టర్ శ్యామ్సన్‌రాజు, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

- బుచ్చినాయుడు కండ్రిగలో.. ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు ఒబ్బు ప్రసాద్, లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాలపై ప్రదర్శించిన చిన్న నాటిక ఆకట్టుకుంది.

- నాయుడుపేటలో... ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన కళలను, నమూనాలను మెచ్చుకున్నారు.

- కోటలో... చిట్టేడు ఎన్‌సిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి జాతీయ సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. 2025లో 'వికసిత్ భారత్ కోసం సైన్స్, ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం భారతీయ య ఉవతకు సాధికారత' థీమ్‌తో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. శ్రీ ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ ఆధ్వర్యంలోనూ నిర్వహించారు.

- గూడూరు టౌన్‌లో... ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విఎస్‌ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ మహేందర్‌రావు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణ, కరస్పాండెంట్ అన్నపూర్ణ, శాంతిప్రియ పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో... ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థుల్లో సజనాత్మక శక్తిని వద్ధి చేయడానికి ఈ సైన్స్ ప్రయోగాలు ఉపయోగ పడతాయని అన్నారు. అనంతరం ఉత్తమ సైన్స్ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- సూళ్లూరుపేటలో.. తేజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 50, 60 సంవత్సరాల క్రితం ఉపయోగించిన పురాతన వస్తువులను సేకరించి విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ముఖ్య అతిథిగా శ్రీహరికోట డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్, ప్రిన్సిపల్ మనోహర్ సింగ్ పాల్గొన్నారు.





టిప్పర్ ట్రిప్పులతో తప్పని తిప్పలు

- అధిక లోడ్‌తో దుమ్ము రేపుతున్న టిప్పర్లు
- గ్రామాల్లో దెబ్బతింటున్న రోడ్లు
- కళ్లకు గంతలు కట్టుకుంటున్న ప్రజలు
- ప్రయాణికులకు శ్వాసకోశ సమస్యలు
- పట్టించుకోని రవాణా శాఖ సిబ్బంది



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలో ఓవైపు గుంతలు పడిన రహదారులను ప్రభుత్వాలు బాగు చేస్తుంటే, మరోవైపు క్వారీల క్రషర్ లారీలు ఛిద్రం చేస్తున్నాయి. దుమ్ము, ధూళికి తోడు రోడ్లు పాడవుతూ గోతులుండడంతో వాటిపై రాకపోకలు సాగించడానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలత్తూరు పంచాయతీ, పట్టాభి గిరిజన కాలనీ పైభాగంలో క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నుంచి పరిమితికి మించిన బరువుతో మెటల్ క్రషర్ లారీలతో తరలిస్తుండడంటంతో తారు రోడ్లు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. క్వారీల నుంచి క్రషర్, చెరువుల నుంచి గ్రావెల్ మట్టిని తరలిస్తున్న టిప్పర్లతో రోడ్డుపై తిరిగే వాహనాలకు, ప్రజలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. క్వారీలపై మాత్రమే దాడులు నిర్వహిస్తున్న రవాణా శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు లారీలపై దృష్టి సారించక పోవడంతో వారికి ఎదురు లేకుండా పోయింది. టిప్పర్ లారీలు అధిక లోడ్‌తో వేగంగా వెళ్లేప్పుడు గాలికి దుమ్ము, ధూళి రోడ్డుపై వెళ్లే ప్రయాణికులనేకాక, రహదారి పక్కనున్న గ్రామ ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తోంది. లారీల వల్ల వచ్చే దుమ్ము ధూళి వల్ల పట్టాభి గిరిజన కాలనీ, కత్తి వారి కండ్రిగ, బసవన్నగుంట గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. దీనివల్ల తాగే నీటిలో, తినే అన్నంలో దుమ్ము పడుతోందని, గాలి పీల్చుకోవాలన్నా ఇబ్బందిపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా క్రషర్ లారీల వల్ల దుమ్ము ధూళి ఎగిసి పడుతుంది. వాహనాలు వెనక వెళ్లాలంటే మార్గం తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. క్రషర్ల ఏర్పాటు చేసే సమయంలో సంబంధిత అధికారులు స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి క్వారీలతో కలిగే అనర్థాలను తెలియజేస్తారు. టిప్పర్లతో దుమ్ము ధూళి ఎగిసి పడకుండా రహదారి మీద నీళ్లతో తడపాలని నిబంధన పొందుపరిచినప్పటికీ, ఏరోజు ఆ నిబంధన పాటించిన పాపాన పోలేదు. ఇష్టారాజ్యంగా లారీలు దుమ్ము రేపుతూ వెళుతున్నాయి. వాహనాలకు పైన పరదాలు కప్పకపోవడంతో కళ్లలో దుమ్ము పడి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. క్వారీ యజమానులకు, టిప్పర్ డ్రైవర్లకు హెచ్చరిక చేయాలన్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ నిధులు మంజూరు చేయండి



ఎంపీడీవోకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉపాధి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేయాలని, వ్యవసాయ కార్మిక సంఘం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో రమేష్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఐ పార్టీ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేష్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని కోరారు. పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలీ 700 రూపాయలకు పెంచాలని, జాబ్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపీ, రాజేష్, భాస్కర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సచివాలయ కేంద్రాలను శుక్రవారం ఉదయం ఎంపీడీవో త్రివిక్రమరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కొందరు సిబ్బంది సీట్లలో లేరని, మరి కొందరు ఫీల్డ్‌పై వెళ్లారని గుర్తించారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నవోదయ 2.0 పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని ఎల్లమంద పంచాయతీకి చెందిన రెడ్డిమాన్యం తండాలో చిత్తూర్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు చంద్రగిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం నవోదయ 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా నాటు సారా తయారుచేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు సారా నిర్మూలించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్,ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బదిలీ



డాక్టర్ హమీద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హమీద్ బదిలీ అయ్యారు. తిరుపతి రుయాలో జనరల్ సర్జరీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువులు నిమిత్తం డాక్టర్ హమీద్ వెళ్తున్నట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం ఆయన రిలీవ్ అవుతూ తన భాధ్యతలను రెండవ వైద్యాధికారి డాక్టర్ ముని చరిత్రకు అప్పగించారు.

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి



రక్తదాతలకు సర్టిఫికేట్లు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రక్తదానం చేయడంవల్ల నిండు ప్రాణాలు కాపాడే వారవుతారని, అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్, కేకేసి గ్రూప్‌లచే ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేకేసి గ్రూప్ ఆఫ్ చైర్మన్ కుప్పయ్య శెట్టి, వైస్ చైర్మన్ నరసింహారావు, కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, టీవీ సుబ్రహ్మణ్యం, గోపీకృష్ణ, రఫీ, గుణశేఖర్ రెడ్డి, వాకర్ అసోసియేషన్ సభ్యులు, కేకేసి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మయూర్‌కు మంచు వారి అభినందనలు



మయూర్‌ను అభినందిస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు ఎంజీఎం సంస్థల ద్వారా విద్య, వైద్యం, వసతి, భవన నిర్మాణ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నందుకు గాను ఆ సంస్థ డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌ను మంచు మోహన్ బాబు ఫ్యామిలీ అభినందించింది. జన్మభూమి ఋణం తీర్చుకోవడంలో భాగంగా ఖర్చు ఎక్కువైనా సేవా రంగాల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకోవడం అభినందనీయమని మోహన్ బాబు, మంచు విష్ణు కొనియాడారు. ఎంజీఎం సంస్థల సేవలు విస్తృతం కావాలని వారు ఆకాంక్షించారు.

శివయ్య సేవలో తెలంగాణ మంత్రి జానారెడ్డి



జానారెడ్డికి స్వామివారి ఫోటో అందిస్తున్న రిషితా రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జానారెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి సాంప్రదా య స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికగా, రిషితా రెడ్డి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

రైల్ నిలయంలో తాగునీటి కొరత తీర్చండి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట రైల్వే స్టేషన్లో తాగునీటి కొరత సమస్య తీవ్రంగా ఉందని ప్రయాణికుల నుండి అందిన విజ్ఞప్తులు, పత్రికల్లో వెలువడుతున్న వార్తా కథనాల ద్వారా తెలుసుకున్న తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో తాగునీటి సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని లేఖలో తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్న కారణంగా ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని, తక్షణమే రైల్వే శాఖ తగిన చర్యలు తీసుకోవానలి ఆ లేఖలో ఆయన కోరినట్లు తెలిపారు.

విద్యార్థులకు 'బెస్ట్ ఆఫ్ లక్' కిట్లు వితరణ



బెస్ట్ ఆఫ్ లక్ కిట్లు అందిస్తున్న జై భీమ్ ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి -పిచ్చాటూరు: పిచ్చాటూరు మండల జడ్పీ హైస్కూల్‌లో జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రి అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరి ప్రకాష్ చేతుల మీదుగా బెస్ట్ ఆఫ్ లక్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రాజకుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ట్రెజరర్ చిరంజీవి, గుర్రప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రుణాల లబ్ధిదారులు 4వ తేదీ హాజరవ్వాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మార్చి 4వ తేదీ జరగబోయే ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఫజుల్లుల్లా తెలిపారు.

భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - సత్యవేడు : ఏపీఐఐసీ పరిశ్రమల కోసం భూమి సేకరిస్తున్నందున, రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకోకుండా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం చట్టం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్‌లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రభుత్వం భూసేకరణ చేస్తున్న కొల్లడం, ఇరుగుళం, పెద్దిటిపాకం, చెన్నైటిపాకం, గ్రామాలలో పర్యటించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమను భయపెట్టి, బెదిరించి, భూములు తీసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గందరగోళంగా ఉందన్నారు. భూములు రిజిస్ట్రేషన్ ద్వారా పొందిన రైతుల పేర్లతోపాటు, అమ్మిన రైతుల పేర్లు కూడా నోటిఫికేషన్‌లో ఉండడం వలన పరిహారం ఎవరికి వర్తిస్తుందో అన్న ఆందోళనలో చాలామంది ఉన్నారని తెలిపారు. భూసేకరణ చేస్తున్న కొన్ని గ్రామాలలో రిజిస్ట్రేషన్లు కూడా కాకుండా నిలుపుదల చేయడం దారుణమన్నారు. అధికారులు పరిహారం చెల్లించే విషయంలో నిర్దిష్టంగా ఒక రేటు నిర్ణయించకుండా భూ సేకరణ చేయడం సమంజసం కాదన్నారు.

రాష్ట్రస్థాయి ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నేతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఏపీ పీజీ సెట్ ను రద్దు చేయాలని శుక్రవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డిఓ ఆఫీస్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు పిజిసెట్ల నిర్వహణ గురించి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడం విద్యార్థులను మోసం చేయడమే అని అన్నారు. కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో వర్సిటీలో దశల వారి ఉద్యమాలు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ బండి చలపతి, ఎన్ఎస్‌యుఐ మల్లికార్జున, ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ అక్బర్, నాల్స సుందర్ రాజ్, జిఎన్ఎస్ శివ శంకర్ నాయక్, జిజెస్ మహేంద్ర నాయక్ ,జై భారత్ విద్యార్థి సంఘం భార్గవ్, ఏఐఎస్ఎఫ్ చంద్రనాయక్, ఎస్ఎఫ్ఐ వినోద్,ఎన్ ఎస్ యుఐ శివ, బాలాజీ, గిరిజన నవ సమాజ్ చంద్ర నాయక్, రాజేష్ నాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మోహన్, విష్ణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక సాగర్ వాకర్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సమ సమాజ స్థాపనకు, సామాజిక సేవలకు, ఆధ్యాత్మిక వ్యాప్తికి వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని నూతన కార్యవర్గం వెల్లడించింది. శుక్రవారం తిరుపతి ఎస్ఎల్వీ నగర్, రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ మేరకు నూతన కార్యవర్గం అధ్యక్షులు సాంబశివారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు సుకుమార్, సహాయ కార్యదర్శి సాయి కృష్ణమరాజు, కోఆర్డినేటర్ చంద్రమోహన్, లీగల్ అడ్వైజర్ మంజుల, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర రావు, వెంకటేశ్వర్లు, నిరంజన్ నాయుడు, సిరిగిరి శంకర్ రాజు, శివానందరెడ్డిలు ప్రమాణం చేశారు. అనంతరం రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సుకుమార్ రాజు చేతుల మీదుగా మూర్తి త్రయం పుస్తక వితరణ చేశారు.

శ్రీకాళహస్తీశ్వరునికి టీటీడీ పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ ఈవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతుల కల్యాణం కోసం శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారి శ్యామలారావు ఈ పట్టు వస్త్రాలు తీసుకువచ్చారు. టీటీడీ ఈవోకు ముక్కంటి ఈవో బాపిరెడ్డి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. మణికంఠ ఆలయం వద్ద నుంచి పట్టు వస్త్రాలను మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య వేడుకగా తీసుకెళ్లారు. అలంకార మండపంలో ఈ పట్టు వస్త్రాలను వేదపండితులకు శాస్త్రోక్తంగా అందజేశారు. అదేవిధంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలు అందాయి. శనివారం ఉదయాత్పూరం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం జరుగుతుంది.

శ్రీవారి దర్శన టికెట్లు ఇవ్వండి



టీటీడీ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుమల: టీటీడీ ధర్మ కర్తల మండలి అధ్యక్షులు బి.ఆర్ నాయుడును డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్ సి మునికృష్ణ, కార్పొరేటర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్కే బాబు, అన్న అనిత, దూది శివ, తిరుత్తని వేణుగోపాల్‌లు చైర్మన్‌ను నగరపాలక సంస్థ కార్పొరేటర్లకు నెలకు ఒకసారి రిఫరెన్స్ ప్రోటోకాల్ దర్శనాన్ని కుటుంబ సభ్యులకు కల్పించాలని కోరారు. దానికి చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

ఈత చెట్లతో పొంచిఉన్న ప్రమాదం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని ఏపీ సీడ్స్ సర్కిల్ నుంచి రామసేతు వంతెన వరకు డివైడర్ వెంబడి ఏర్పాటు చేసిన ఈత చెట్లతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. పచ్చదనం పెంపులో భాగంగా మున్సిపల్ అధికారులు డివైడర్ వెంబడి ఈత చెట్లను నాటారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తాళ్లతో కట్టి ఉన్న ఈత ఆకులకు మోక్షం కల్పించారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా, తాళ్లతో కట్టినంత వరకు ఆకాశాన్ని చూసిన ఈత ఆకులు ఆ తాళ్ళ నుంచి విముక్తి చేయగానే రోడ్డుకిరువైపులా వాలిపోయాయి. ఫలితంగా వాహనదారుల కళ్ళకు ముళ్లతో కూడిన ఈత ఆకులు తగిలే ప్రమాదం ఉంది. అన్ని ఈత చెట్ల పరిస్థితి ఇదే. ఏపీ సీడ్ సర్కిల్ నుంచి రామసేతు వంతెన వరకు ఒకవైపు డివైడర్ గోడను కూల్చి, కొత్తగా గోడను కట్టి, అందులో ఈత చెట్లను, నంది రాతి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు ఏకంగా రూ.54 లక్షలు ఖర్చు చేసేశారు. తీరా 'కొండనాలుకకు మందు తెస్తే ఉన్న నాలుక ఊడిన' చందంగా డివైడర్ పరిస్థితి తయారయింది. ఒకవైపు ఈత చెట్లు ప్రమాదకరంగా మారగా, మరోవైపు స్థల వివాదం కారణంగా ఓ ప్రాంతంలో నిర్మించిన సింగిల్ డివైడర్ గోడ అంద విహీనంగా మారింది.

భూసంబంధిత అంశాలు తప్పల్లేకుండా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రీసర్వే రెవెన్యూ భూసంబంధిత అంశాలు ప్రజలతో ముడిపడి ఉంటాయని, వాటిని సకాలంలో పరిష్కరిస్తే చాలా వివాదాలు ఉండవని, పీజిఆర్ఎస్ తదితర గ్రీవెన్స్ ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో అందిన పలు భూసంబంధిత మ్యూటేషన్, సర్వే, పాస్‌పుస్తకం, సర్వే నంబర్ సబ్ డివిజన్ తదితర అంశాలపై వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, తప్పులేకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జేసీ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుతో కలిసి రెవెన్యూ సిబ్బందితో కాన్ఫరెన్స్‌నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.

వారపు సంత వేలం వాయిదా

ప్రజాశక్తి - రేణిగుంట : పట్టణంలోని శుక్రవారం రేణిగుంటకు సంబంధించి దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, బస్టాండ్ వద్ద ఉన్న పంచాయతీ సముదాయానికి నిర్వహించాల్సిన వేలం పాట వాయిదా పడింది. దీంతో గుత్తేదారులు పంచాయతీ కార్యాలయం వద్ద తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని వాపోయారు. టిడిపి సీనియర్ నాయకులు జీకె మునీర్ మాట్లాడుతూ ఎప్పటినుండో రేణిగుంటకు సంబంధించిన అంగళ్లను వారు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నారని, ముందుగా తెలియజేయాలని డిమాండ్‌చేశారు. ఇన్‌ఛార్జి కార్యదర్శి సత్తార్‌కు వినతిపత్రం అందించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి :కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు అందరూ కలసి రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శుక్రవారం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, దుకాణాల యజమానులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్.యం.ఆర్ కార్మికులందరినీ, దశలవారీగా పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కోరుతూ శుక్రవారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీనాథ్, గౌరవాధ్యక్షులు జోగి.శివకుమార్,నాయకులు బి. వి.రమణయ్య,అడపాల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కోట : పేద విద్యార్థులకు అందిస్తున్న దాతృత్వాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం కోట పట్టణంలోని అల్లారెడ్డి వెంకట కృష్ణారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 25వ ఉత్తమ విద్యార్థుల అభినందన ప్రోత్సాహక బహుమతుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు నెల్లూరు సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోట, వంజివాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులు ఉదయ్ భాస్కర్, నాగయ్య, ఆవుల సుబ్బయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణ వనం సమీపంలోని వేదనారాయణ కళాశాల వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిరన వివరాల మేరకు, నారాయణవనం మండలం, కసిమిట్ట గ్రామానికి చెందిన నెట్టేసన్ కుమారుడు కంపుకుట్టి ఏసు, భీముని చెరువు గ్రామానికి చెందిన మురుగేషన్ ఇద్దరు డ్యూటీ ముగించుకొని ఇంటికి బయలుదేరి వెళుతుండగా, వేద నారాయణ కళాశాల సమీపంలో లారీ ట్యాంకర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఏసు అక్కడికక్కడే మృతిచెందగా, మురుగేషన్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. యేసు మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు లారీలు ఢీ.. ఒకరు మృతి





ప్రమాద దృశ్యం, మృతి చెందిన చలంచర్ల రామయ్య

ప్రజాశక్తి-పెళ్లకూరు: శుక్రవారం పెళ్లకూరు మండలం, చవటకండ్రిగవద్ద జాతీయ రహదారిపై నాయుడుపేట వైపు నుండి బెంగళూరు వెళ్తున్న కంటైనర్ ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టడంతో అదుపుతప్పి రోడ్డు ప్రక్కన బోల్తా పడింది. అదే సమయంలో చవట కండ్రిగ నుండి బాతులు మేపుకుంటూ సైకిల్ మీద ప్రయాణిస్తున్న వ్యక్తి లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంగమేశ్వర రావు, ఎస్సై నాగరాజ్, తన సిబ్బందితో అక్కడికి చేరుకుని లారీలో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి కోవూరు మండలం, వేగూరు రామాపురం గ్రామానికి చెందిన చలంచర్ల రామయ్య (58)గా గుర్తించి పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఘనంగా టైలర్స్ డే



టైలర్స్ డే జరుపుకుంటున్న దర్జీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, శ్రీ లక్ష్మీ వినాయక టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో టైలర్స్ డే దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్జీ గోవిందస్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చిన్నబ్బ, మునస్వామి రెడ్డి, గోవిందన్ యాదవ్, కొడగంటి రాజేంద్ర, కొడకంటి సూరి, సి ఏ మని, ధనమ్మ, గీతాంజలి, అధ్యక్షులు కిలారి భాస్కర్, ఉపాధ్యక్షులు వెంకట ముని, ప్రధాన కార్యదర్శి రమేష్, ట్రెజరర్ గణేష్ రాయల్, పుత్తూరు టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర సహాయ కార్యదర్శి, అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు కొడగంటి రాజేంద్రన్ సెక్రటరీ రమేష్, జాయింట్ సెక్రటరీ సురేష్, ట్రెజరర్ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు, గ్రావెల్ తొలగింపు



ముళ్ల కంపలు తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: శ్రీకాళహస్తి నుండి తడవైపు రోడ్డు మార్గం, పార్లపల్లి మలుపు వద్దనున్న బ్లాక్ స్పాట్ నందు ఇరువైపులా ఉన్న రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ళపొదలను, గ్రావెల్‌ను శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు, వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడుల ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఇ-స్కూటర్ డిప్లోస్ మాక్స్ విడుదల



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్వదేశీ ఎలక్ట్రిక్ వాహనాలలో ప్రత్యేకత కలిగిన నవీన తరపు ఒరిజినల్ పరికరాల తయారీదారు న్యూమెరస్ మోటర్స్, తమ మల్టీయుటిలిటీ ఇ-స్కూటర్, డిప్లోస్ మాక్స్‌ను పరిచయం చేసింది. న్యూమెరస్ మోటర్స్ వైస్ ప్రెసిడెంట్- ఇంజనీరింగ్ సౌందరరాజన్ ఎస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్కూటర్ 13.9 మిలియన్ కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది పరీక్షలో నిలిచిందని తెలిపారు. డిస్క్ బ్రేక్‌లు, ఎల్ ఈడి లైటింగ్, దొంగతనం హెచ్చరికలు వంటి అధునాతన ఫీచర్‌లను కలిగి ఉందని తెలిపారు. ఈ వాహనం రూ. 1,12,199 ఎక్స్-షోరూమ్ ధరకు అందుబాటులో ఉందని తెలిపారు.ఈ వాహనాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో నేటి నుండి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. గూడూరు పట్టణంలో డి ఆర్ డబ్ల్యు, నారాయణ, స్వర్ణాంధ్ర భారతి, ఎస్.కె.ఆర్ , సెయింట్ మేరీస్, కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఢిల్లీ బాబు తెలిపారు. మార్చి ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకుఇంటర్ పరీక్షలు కొనసాగుతుందన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం



ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మూడవ అంతర్జాతీయ తెలుగు ప్రపంచ మహాసభలలోని పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ, ప్రాచ్య పరిశోధనా సంస్థ, తెలుగు సంపద, బెంగళూరు సంయుక్తంగా నిర్వహించిన మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు ఎస్వీయూ సెనేట్ హాల్ ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ తెలుగుదనానికి నిలువెత్తు సంతకం ఎన్‌టి రామారావు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రాంతంలో భాష ప్రాధాన్యం పెరగాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, నిర్వాహకులు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు, ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ, రేమిళ్ల మూర్తి, రచయితలు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు. తిరుపతి ఆర్ట్ సొసైటీలో మంచి చిత్రాలు గీసిన కళాకారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సదస్సులో 1. తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ ప్రతి గ్రామంలో, పట్టణంలో గోడలపై రాయాలి, 2. తెలుగులోనే ప్రభుత్వ చట్టాలు, న్యాయవాదుల తీర్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి, 3. నూతన విద్యా విధానాన్ని అనుసరించి మాతృభాషలోనే ఐదవ తరగతి వరకు విద్యాబోధనకు కట్టుబడాలి, 4.సామాజిక మాధ్యమాల్లో ,సెల్ఫోన్లలో ఆంగ్లాన్ని కాకుండా తెలుగు భాషను ఉపయోగించుకోవాలి, 5. ప్రాచీనమైన ప్రతి తెలుగు గ్రంథాన్ని ఆధునిక వచనంలోకి మార్చుకునే ప్రణాళికలు సిద్ధం చేయాలి, 6. తెలుగులో వచ్చిన ప్రతి గ్రంథాన్ని భావితరాల కోసం డిజిటలైజేషన్ చేసి భద్రపరచాలి, 7.తెలుగు కుటుంబాలలో బిడ్డలకు అన్ని పదాలు తెలుగులో నేర్పేందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలి అని చేసిన తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఉపాధి నిధులతో నీటి సంరక్షణ పనులు చేపట్టండి
- చంద్రగిరిలో సామాజిక తనిఖీ
- రూ.7 వేలు రికవరీ
- సిబ్బందిని మందలించిన పీడీ



ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బహిరంగ సభలో మాట్లాడుతున్న డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయం లో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన చంద్రగిరి మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకంలో పనుల పైన సామాజిక తనిఖీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో నీటి సంరక్షణ పనులు చేపట్టి, ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 915 పనులకు గాను 888 పనులు చేసినట్లు ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించిందని తెలిపారు. ఉపాధి హామీ పనులకు 8 కోట్ల,17 లక్షల 876 ఖర్చు చేసినట్లు బహిరంగ సభలో వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు ఎస్ఆర్పి రవి ఆధ్వర్యంలో డిఆర్పీలు, విఎస్ఏలు గ్రామాలలో పర్యటించి సేకరించిన వివరాలను నివేదికలుగా తయారు చేసి సభకు వివరించారు. గంగుడుపల్లి, మామండూరు, పులిత్తివారిపల్లి, అగరాల తదితర గ్రామాలలో క్షేత్ర సహాయకులు అవినీతి పాల్పడ్డట్టు సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ఇందులో అగరాల పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించడానికి ఏపీడి చిన్న రెడ్డప్పను ఆదేశించారు. ఉపాధి హామీ తనిఖీలు సోషల్ ఆడిట్ బృందం 7వేల రూపాయలు మాత్రమే రికవరీకి చూపించింది. మిగిలిన పంచాయతీలలో జరిగిన చిన్నచిన్న అక్రమాలకు డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ క్షేత్ర సహాయకులను మందలింపులతో సరిపెట్టారు. ఈ బహిరంగసభలో యంపిడీఓ శేఖర్, ,డివిఓ శివయ్య, ఏపిడి చినరెడ్డటప్ప, యస్ ఆర్ పి రవి, ఏవివి గణేష్ కుమార్, , ఏపీవో జ్యోతి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు,సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలకు విలువ జోడింపుపై శిక్షణ



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, అఖిల భారత జొన్న, చిరుధాన్యాల సమన్వయ పరిశోధన పథకం వారి షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక 2024-25 భాగంగా "చిరుధాన్యాలకు విలువ జోడింపుపై శిక్షణా కార్యక్రమం, వంట ఉపకరణాల పంపిణి" కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నగొట్టిగల్లు పరిసర ప్రాంతాలలో ఉన్న ఎస్సి కులానికి చెందిన 25 మంది ఔత్సాహిక మహిళలు శిక్షణకు హాజరయ్యారు. విన్స్ సంస్థ డైరెక్టర్ ఆర్. మీరా చొరవతో చిరుధాన్యాల వంటకాలు తయారీలో ఆసక్తి కనబరుస్తున్న 25 మంది మహిళలను శిక్షణకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఏం.వి. రమణ, పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి, డాక్టర్ ఎస్. కలీముల్లా, మహిళలు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అవగాహన



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆర్‌బిఐ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయం సూచనల మేరకు శుక్రవారం తిరుపతి, సర్కిల్ కార్యాలయంలో డిజిటల్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్కిల్ ఆఫీస్ హెడ్, జనరల్ మేనేజర్ ఐ.పి.మితాంతయ మొబైల్ వ్యాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబరు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అదే విధంగా ఇందుకు నిర్దేశించిన వెబ్ సైట్ సైబరక్రైమ్.గవర్నమెంట్.ఇన్ సందర్శించవచ్చన్నారు. సైబర్ నేరాలపట్ల అందరిలో అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో మొదట మొబైల్ వ్యాన్‌ని ప్రారంభించి, తర్వాత వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రంలో డిజిఎం జి. ఎన్.మూర్తి, రవీంద్ర కుమార్ అగ్రవాల్, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో పిడికిలి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళ టైలర్స్ మాట్లాడుతూ ధరించిన వస్త్రం మనిషి యొక్క హుందాతనాన్ని తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ డైరెక్టర్ నాగరత్న, ఉపాధ్యక్షురాలు పుష్పలత, మండల కమిటీ డైరెక్టర్ వార్తల రజనీ యాదవ్, టైలర్స్ శైలజ, తులసి, గాయత్రి, నిర్మల, భావన, హరిప్రియ, హోమియోపతి డాక్టర్ అసిస్టెంట్ ప్రొపెర్ సాయితీ, డాక్టర్మెడికల్ ఆఫీసర్ శ్రావియ, ఇంటర్నిస్ గ్రేసీపేసి షీభ ప్రియాంక, ధరణి అఖిల తదితరులు పాల్గొన్నారు.

వెంకట కృష్ణయ్యకు నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టీడీపీ నేతలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబాక్కం టీడీపీ నేత వెంకట కృష్ణయ్య మూడు రోజుల క్రితం మరణించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం మృతుని స్వగ్రామమైన కుక్కం బాక్కం చేరుకొని వెంకట కృష్ణయ్య చిత్ర పటంవద్ద నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టిడిపి నేత గోపాల్ రెడ్డికి నివాళి



గోపాల్ రెడ్డికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం అప్పంబట్టులో టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి ఆనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం ఉదయం మృతుని ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ డీ.ఇలంగోవన్ రెడ్డి, అరణియార్ ఆయకట్ట ఛైర్మన్ రవి రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు వాసు రెడ్డి, బలరామ్, వేలాయుదం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



ర్యాలీలో పాల్గొన్న దర్జీలు

పాకాలలో...: టైలర్లకు సమగ్ర చట్టం అమలు చేసి, ఆదుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చైతన్య టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో టైలర్లకు16,000 భృతి ఇస్తున్నారని, ఆంధ్రాలో కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు .ఈ కార్యక్రమంలో టైలర్ సంఘం సీనియర్ నాయకులు షరీఫ్, సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్, టైలర్ సంఘం అధ్యక్షులు వేణు టైలర్ సంఘం ఉపాధ్యక్షులు అబ్దుల్ రజాక్, శేఖర్ రెడ్డి, హబీబ్, సహాయ కార్యదర్శి, త్యాగరాజులు అధ్యక్షులు చంద్ర ఇతర టైలర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పాకాల :



టైలర్స్ డే వేడుకల్లో పాల్గొన్న మహిళా దర్జీలు

టైలర్లకు సమగ్ర చట్టం అమలు చేని, టైలర్స్‌ను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్, టైలర్ సంఘం అధ్యక్షులు వేణు టైలర్ సంఘం ఉపాధ్యక్షులు అబ్దుల్ రజాక్, శేఖర్ రెడ్డి, హబీబ్, సహాయ కార్యదర్శి, త్యాగరాజులు అధ్యక్షులు చంద్ర ఇతర టైలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న టైలర్స్ సంఘు నాయకులు

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: మండల కేంద్రంలో అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం బస్టాండ్ వద్ద 200 వందల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చిన్ని రాజ్ మాట్లాడుతూ టైలర్ వృత్తిని ప్రభుత్వం గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి టైలర్స్ కు సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



టైలర్స్ డే వేడుకల్లో కేక్ కట్ చేసిన దర్జీలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు :మండల కేంద్రమైన పిచ్చాటూరులో శుక్రవారం టైలర్స్ డేను బాలాజీ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ సంఘు నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, దర్జీలకు రాయితీ రుణాలు కల్పించాలని, 50 ఏళ్లకే పింఛను అందించాలని కోరారు.